www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 6 నవంబర్ 2025



వైద్య కళాశాలల ప్రయివేటీకరణ ఆపాలి : సిపిఎం

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మనోహర్, పులివెందుల నాయకులు గపూర్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వపరంగా నడిపినప్పుడే విద్యా, వైద్య రంగం అభివృద్ధి అవుతుందని తెలిపారు. పేద ప్రజానీకానికి, విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ప్రయివేటీకరించడం, ఇంకో చోటికి తీసుకెళ్లడ సరైనదికాదన్నారు. ప్రజల ఆస్తి ప్రజలకు ఉపయోగపడాలి తప్ప కొందరి ఆదాయానికి ఉపయోగపడకుండా ఉండాలన్నారు. ప్రజలు ఓట్లేసి గెలిపించి అధికారంలోకి తీసుకొస్తే పేద ప్రజానీకానికి వ్యతిరేకంగా ప్రయివేటుకరించడం మంచిది కాదని తెలిపారు. విద్యారంగం ప్రభుత్వ పరిధిలో ఉంటే మరింత అభివృద్ధికి ఉపయోగకరమని తెలిపారు. ప్రభుత్వం ప్రయివేటీకరణ ఆలోచన విరమించుకోవాలని కోరారు.

పంచాయతీలకు కొత్తరూపు

- నాలుగు గ్రేడ్లుగా గుర్తింపు
- ఇకపై కార్యదర్శులు కనుమరుగు
- అభివృద్ధి అధికారులుగా మార్పు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని పంచాయతీలు కొత్తరూపాల్ని సంతరించుకోనున్నాయి. ఇటీవలి కేబినెట్ సమావేశంలో పంచాయతీల క్లస్టర్ వ్యవస్థను రద్దు చేసి, స్వతంత్ర సంస్థలుగా తీర్చిదిద్దుతామని మంత్రివర్గం ప్రకటించిన సంగతి తెలిసిందే. జిల్లా పంచాయతీ అధికారులు పంచాయతీల జనాభా, ఆర్థిక సామర్థ్యాల ఆధారంగా నాలుగు కేటగిరీలుగా తీర్చిదిద్దడానికి అవసరమైన ప్రణాళికను సిద్ధం చేశారు. ప్రభుత్వ పరిశీలన అనంతరం పంచాయతీలను నాలుగు గ్రేడ్లుగా రూపాంతరం చెందనున్నాయి. మున్సిపాలిటీల తరహాలో పంచాయతీలకు అభివృద్ధి అధికారుల నియామకం మొదలుకుని ఆర్థిక జవసత్వాలను కలిగించేందుకు అవసరమైన రీతిలో సంస్కరణలు తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది.

జిల్లాలో 557 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మున్సిపాల్టీల తరహాలో మెరుగైన సేవలను అందుబాటులో ఉంచుతామని చెబుతూ అధిక ఆదాయం, జనాభా ప్రాతిపదికన నాలుగు రకాల గ్రేడ్లుగా విభజించనున్నారు. స్పెషల్ గ్రేడ్ (రూర్బన్) పంచాయతీల్లో 10 వేల జనాభా, రూ.కోటికిపైగా ఆదాయం కలిగిన బి.మఠం, పోరుమామిళ్ల, ముద్దనూరు, ప్రొద్దుటూరులో రెండు పంచాయతీలు, చెన్నూరు, ఖాజీపేట, వేంపల్లి పంచాయతీలను స్పెషల్‌గ్రేడ్ (రూర్బన్) పంచాయతీలుగా మార్చుతున్నట్లు ప్రణాళికను సిద్ధం చేశారు. స్పెషల్‌గ్రేడ్ (రూర్బన్) పంచాయతీల్లో పాలనా విభాగాలు, గ్రామీణ ప్రణాళిక, ప్రజారోగ్యం, వీధిలైట్ల నిర్వహణ, తాగునీటి సరఫరా, ఇంజినీరింగ్ విభాగాలను ఏర్పాటు చేయనున్నారు. పైన పేర్కొన్న విభాగాల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించనున్నారు. ఇళ్లు, భవన నిర్మాణాలకు నియంత్రణకు మున్సిపాలిటీల్లో మాదిరిగానే ప్లానింగ్ విభాగాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని 427 సచివాలయాలకు చెందిన ఇంజినీరింగ్, డిజిటల్



అసిస్టెంట్లను, స్పెషల్‌గ్రేడ్ (రూర్బన్) పంచాయతీల్లో గ్రామీణ ప్లానింగ్ అసిస్టెంట్లుగా నియమించనున్నారు. నాలుగు వేల నుంచి 10 వేల జనాభా కలిగిన పంచాయతీలకు రూ.50 లక్షల నుంచి రూ.కోటి ఆదాయం ప్రాతిపదికగా 59 గ్రేడ్-1 పంచాయతీలుగా, రెండు వేల నుంచి నాలుగు వేల జనాభా ప్రాతిపదికన 154 పంచాయతీలను గ్రేడ్-2 పంచాయతీలుగా, రెండు వేల జనాభా లోపు పరిగణలోకి తీసుకుని 333 పంచాయతీలను గ్రేడ్-3 పంచాయతీలుగా మార్చడానికి ప్రాథమిక నివేదికను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

ఎపిడిఒలుగా పంచాయతీ కార్యదర్శులు

జిల్లాలోని 557 పంచాయతీల్లో 225 కార్యదర్శులు ప్రధాన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పాలకవర్గాలు ఆమోదించిన తీర్మానాల అమలు, పంచాయతీల్లోని ఇతర విభాగాల పర్యవేక్షణ, ఇతర బాధ్యతలు గ్రామ కార్యదర్శులుగా ఉన్నాయి. తాజాగా పంచాయతీ కార్యదర్శులను పంచాయతీ అభివృద్ధి అధికారి (ఎపిడిఒలుగా) మార్చుతున్నారు. స్పెషల్‌గ్రేడ్ (రూర్బన్) పంచాయతీల్లో డిప్యూటీ మండల పరిషత్ అధికారిని నియమించనున్నారు. గ్రామ పంచాయతీల్లో వివిధ శాఖల ఉద్యోగులు విధులను ఎపిడిఒ, డిప్యూటీ మండల పరిషత్ అధికారులు పర్యవేక్షించనున్నారు.

జిజిహెచ్‌ను అభివృద్ధి పథంలో నడిపించాలి

- హెచ్‌డిఎస్ సమావేశంలో చైర్మన్ శ్రీధర్

ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న జిల్లా సర్వజన ఆసుపత్రి (జిజిహెచ్)ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని హెచ్‌డిఎస్ చైర్మన్, కలెక్టర్ శ్రీధర్ సభ్యులను ఆదేశించారు. బుధవారం రిమ్స్ ప్రభుత్వ వైద్యకళాశాల బోర్డు మీటింగ్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన 51వ ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ప్రజా స్పందనలలో కడప జిజిహెచ్ మంచి ప్రతిభ కనబరచిన డాక్టర్లను అభినందించారు. జిజిహెచ్‌లో అన్ని విభాగాల్లో డాక్టర్లు ఉన్నారని ప్రజలకు మంచి ఆరోగ్య సేవలు అందించాలన్నారు. కింది స్థాయి సిబ్బంది రోగుల దగ్గర నుంచి డబ్బులు వసూలు చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. వైద్య విభాగాధిపతులు కేవలం వైద్యం వరకే పరిమితం కాకుండా ఆయా విభాగాల్లో పరికరాల నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి కేవలం జిల్లా ప్రజలకు మాత్రమే కాకుండా రాయలసీమ స్థాయిలో కూడా ప్రజలకు అత్యుత్తమ, మెరుగైన వైద్య సేవలు అందిస్తోందన్నారు. సువిశాలమైన, ఆహ్లాదకరమైన వాతావరణంతో మెరుగైన వైద్యసేవలతో వేలాది మంది ప్రజలు ప్రతి నిత్యం ఆరోగ్య రక్షణ కల్పిస్తున్న జిజిహెచ్ ఆసుపత్రిని మరింత అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని హెచ్‌డిఎస్ సభ్యులకు సూచించారు. జిజిహెచ్ పరిధిలో ఇప్పటికే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, కేన్సర్ రీసెర్చ్ ఆసుపత్రి, నేత్ర వైద్యశాల, మానసిక వైద్యశాలలు అందుబాటులో వున్నాయ న్నారు. రాయలసీమలోనే అత్యాధునిక వైద్య సేవలు అందించే మెడికల్ హబ్‌గా వైఎస్ఆర్ జిల్లా జిజిహెచ్ విస్తృత సేవలు అందిస్తుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యం దిశగా జిజిహెచ్ అభివృద్ధి సొసైటీ ముందుకెళుతోందన్నారు. భవిష్యత్తులో జిజిహెచ్‌ను మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సభ్యులు, వైద్య సిబ్బందిని కోరారు. అనంతరం.. జిజిహెచ్‌లోని అన్ని



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

విభాగాల వైద్యాధిపతులతో కలెక్టర్ సమీక్షించారు. ఆయా విభాగాల్లో అవసరమైన వసతులు, సదుపాయాలు, వైద్య పరికరాలు, వైద్య సిబ్బంది తదితర అన్ని వివరాలను అడిగి తెలుసుకున్నారు. అజెండా మేరకు అన్ని విభాగాలలో పూర్తి వివరాలను చర్చించిన అనంతరం జిజిహెచ్‌లో అవసరమైన వైద్య పరికరాల కోసం రూ.3.5 కోట్ల విలువైన పరికరాలను కొనుగోలు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. ఇప్పటికే పురోగతిలో ఉన్న పలు అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముందుగా జిజిహెచ్ సూపరింటెండెంట్ రిమ్స్ హాస్పిటల్ ప్రోగ్రెస్‌పై పిపిటి ప్రెజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. 50వ హెచ్‌డిఎస్ మీటింగ్‌లో తీసుకున్న యాక్షన్ టేకెన్ రిపోర్ట్ ను వివరించారు. సమావేశంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు, రిమ్స్ ఎస్‌డిసి రంగ స్వామి, జిజిహెచ్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ జమున, సిఎస్ ఆర్ఎంఒ డాక్టర్ వై.శ్రీనివాసులు, ఎఇఎంఎస్ఐడిసి ఇఇ ఎ.వెంకటేశ్వరరెడ్డి, ఎపివివిపి డిసిహెచ్ఎస్ డాక్టర్ వై.హిమదేవి, నర్సింగ్ సూపరింటెండెంట్ వెంకట రమణమ్మ, హెచ్‌డిఎస్ సభ్యులు, అన్ని విభాగాల వైద్యాధిపతులు పాల్గొన్నారు.

వైద్య పరికరాల తరలింపు ఆపండి : ఎంపీ

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

రాష్ట్రంలో వైద్యాన్ని ప్రయివేటీకరణ చేసే దిశగా ప్రభుత్వం ఉందని, పులివెందుల ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో అత్యాధునిక పరికరాల తరలింపు ఆపాలని కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్.అవినాష్‌రెడ్డి అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని మెడికల్ కళాశాల ప్రారంభ సమయంలో అత్యాధునికమైన పరికరాలను సమకూర్చడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మెడికల్ సీట్లను వెనక్కి పంపిందన్నారు. ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లోని పరికరాలను గుంటూరు, కర్నూలుకు



మాట్లాడుతున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

తరలిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు ప్రయివేటీకరణ ఆపాలని నిరసనలు చేస్తుంటే కూటమి ప్రభుత్వం మాత్రం కక్షధోరణిలో వెళుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అంగన్వాడీ, రేషన్ డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించాలన్నారు. వైసిపి నాయకులపై అరాచకాలు చేస్తూ, అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. జిల్లాలోని టిడిపి నాయకులు ఈ ప్రాంతానికి అన్యాయం జరగకుండా అడ్డుకోవాలన్నారు. ప్రభుత్వ ధోరణి మారకపోతే వైసిపి పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వైఎస్.మనోహర్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప పాల్గొన్నారు.

విలీన పంచాయతీల సమస్యలపై 17న ఆందోళన



మాట్లాడుతున్న నగర కార్యదర్శి రామమోహన్

- సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్

ప్రజాశక్తి-కడప అర్బన్

నగర పాలక సంస్థ ఏర్పడి ఈ నెల 17 నాటికి 21 సంవత్సరాలు పూర్తయినా నేటికీ పంచాయతీల నుంచి విలీనమైన డివిజన్లలో ఎలాంటి అభివృద్ధి జరగడం లేదని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ విమర్శించారు. బుధవారం సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడతూ కడప నగరం అభివృద్ధి అంటే ప్రధాన కూడళ్లలో మాత్రమే అభివృద్ధి కాదని, పంచాయతీల్లో విలీనమైన డివిజన్లలో స్థానిక సమస్యలు నేటికీ పరిష్కారం కావడం లేదన్నారు. సరైన రోడ్లు, మురికి కాలువలు, విద్యుత్ స్తంభాలు లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కడప నగరంలో 8 గ్రామ పంచాయతీలు, 26 గ్రామాలు విలీనం చేసారని, ఆ గ్రామాలకు ప్రజలు కార్పొరేషన్ కు అన్ని రకాల పన్నులు చెల్లిస్తున్నా అభివృద్ధి మాత్రం శూన్యమన్నారు. వర్షాకలంలో రోడ్ల మీద మురుగునీరు ప్రవహిస్తోందని, దీని కారణంగా ప్రజలు తీవ్ర జబ్బులకు గురవుతున్నారని తెలిపారు. ఆస్పత్రులకు రూ.లక్షలు ఖర్చు చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఈ పరిస్థితి నుంచి ప్రజానికాన్ని బయట పడాలంటే ఆ డివిజన్లకు ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో నగర ప్రజానికం పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, నగర కమిటి సభ్యులు చంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి, నరసింహ పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్టు



మాట్లాడుతున్న ఎస్‌పి నచికేత్ విశ్వనాథ్

- నగదు, సెల్ ఫోన్లు, బ్యాంకు పాస్ పుస్తకాలు స్వాధీనం
- ఎస్‌పి షెల్కె నచికేత్ విశ్వనాథ్ వెల్లడి

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రొద్దుటూరు పట్టణంలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఆరుగురి ముఠా సభ్యులను అరెస్టు చేశామని ఎస్పిఇ షెల్కె నచికేత్ విశ్వనాథ్ తెలిపారు. బుధవారం ఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు డిఎస్‌పి భావన, సిఐలు సదాశివయ్య, నాగభూషణ్ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. బెంగళూరు కేంద్రంగా ఈ ముఠా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారని తెలిపారు. బెట్టింగుకు పాల్పడుతున్న ఆర్ల చెన్న కృష్ణ, నరేంద్ర, హరి, సుధీర్ కుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రవితేజను ప్రొద్దుటూరులో బుధవారం అరెస్టు చేసినట్లు చెప్పారు. వారి వద్ద నుంచి రూ.6.28 లక్షల నగదు, 8 సెల్ ఫోన్లు, నాలుగు బ్యాంకు పాస్ పుస్తకాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వెబ్‌సైట్లు బ్లాక్ చేయాలని డిజిపికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. బెట్టింగ్ నిర్వాహకులు ఎంతటి వారైనా పోలీసు నిఘా నుంచి తప్పించుకోలేని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారు ఎంతటివారైనా ఉపేక్షించమని హెచ్చరించారు. సమావేశంలో ఎఎస్‌పి ప్రకాష్ బాబు, ప్రొద్దుటూరు డిఎస్‌పి భావన, సిఐలు సదాశివయ్య, నాగభూషణ్, ఎస్ఐలు ధనుంజయుడు, రాఘవేంద్రారెడ్డి పాల్గొన్నారు.

పెద్దదర్గా ఉరుసుకు పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి-కడప అర్బన్: నగరంలో ప్రాచీనమైన అమీన్‌పీర్ పెద్దదర్గా ఉరుసు ఉత్సవాలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ తెలిపారు. బుధవారం దర్గాలో ఉరుసు ఉత్సవాల ఏర్పాట్లను దర్గా నిర్వాహకులు, పోలీసు అధికారులతో కలిసి పరిశీలించారు. సుమారు 400 మంది పోలీసు సిబ్బందితో, 200 సిసి కెమెరాల నిఘాతో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా మహిళా సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. ఎస్‌పి వెంట స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పి ఎన్.సుధాకర్, కడప డిఎస్‌పి ఎ.వెంకటేశ్వర్లు, నగరంలోని సిఐలు, ఎస్ఐలు ఉన్నారు.

కబడ్డీలో ఎగువ రామాపురం విద్యార్థుల ప్రతిభ


ప్రజాశక్తి-కలసపాడు: బద్వేల్‌లోని వీరారెడ్డి కాలేజ్ మైదానంలో ఈ నెల 4వ తేదీ నుండి జరిగిన జిల్లా సబ్ జూనియర్స్ కబడ్డీ పోటీల్లో ఎగువ రామాపురం జిల్లా పరిషత ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ సత్తా చాటారు. పదో తరగతి చదువుతున్న టి.నాగేంద్ర కబడ్డీలో తన సత్తా చాటి అద్భుతమైన ఆట తీరును ప్రదర్శించి బాలుర విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. బాలికల విభాగంలో 9వ తరగతి చదువుతున్న సి.కావ్య రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. 9వ తరగతి చదువుతున్న కె.సింధు కబడ్డీకి స్టాండ్ మెంబర్‌గా రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. గత నెల 31 వ తేదీన రాయచోటిలో జరిగిన ఎస్‌జిఎఫ్ పోటీలలో ఈ పాఠశాల నుండి టి.నాగేంద్ర, కె.సింధు కబడ్డీ పోటీలలో రాష్ట్ర స్థాయికి ఎంపిక య్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె.మేర్సీ మాలిని మాట్లాడుతూ మా పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం చాలా గర్వంగా ఉందన్నారు. విద్యార్థుల్లో కృషి, పట్టుదల ఉంటే ఎంతైనా రాణిస్తార న్నారు. కృషికి ఫలితం ఉంటుందని, విద్యతో పాటు వ్యాయామం కూడా చాలా ముఖ్యమని చెప్పారు. వ్యాయామ ఉపాధ్యాయుడు సురేష్ రవి కుమార్‌ను అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయులు మాట్లాడుతూ హెచ్ఎం ప్రోత్సా హమే ఇందుకు కారణమన్నారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు విజేతలను అభినందిస్తూ ఇంకా ఉన్నతమైన స్థానాలకు ఎదగాలని కోరారు.



గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

మంత్రి లోకేష్‌ను కలిసిన రామసుబ్బయ్య

ప్రజాశక్తి-కలసపాడు



విజయవాడలోని టిడిపి రాష్ట్ర కార్యాలయంలో మంత్రి నారా లోకేష్‌ను కలసపాడు మాజీ ఎంపిటిసి కడియం రామసుబ్బయ్య కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 40 సంవత్సరాల నుంచి కలసపాడు నుంచి గిద్దలూరుకు వెళ్లే దారిలో పాత బ్రిడ్జి ఉందని తెలిపారు. అది కూడా కూలేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. వెంటనే నూతన బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని మంత్రి నారా లోకేష్‌ను కోరినట్లు పేర్కొన్నారు. మంత్రి సందిస్తూ త్వరలో నూతన బ్రిడ్జి ఏర్పాటుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. మండలంలో అభివృద్ధి చాలా అధ్వానంగా ఉందని మంత్రికి చెప్పనట్లు తెలిపారు.

బుడ్డా వెంగళరెడ్డి జీవితం నేటి తరానికి ఆదర్శం

ప్రజాశక్తి-కడప అర్బన్

రేనాటి చంద్రునిగా ప్రసిద్ధిగాంచిన మహాదాత బుడ్డా వెంగళరెడ్డి జీవితం నేటి యువతరానికి ఆదర్శనీయమని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.సలీంబాష అన్నారు. బుడ్డా జీవితంపై రూపొందించిన వీడి యోను బుధవారం కళాశాలలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1866లో సంభవించిన భయం కరమైన కరువులో తిండికి లేక రాయల సీమలో వేలాది మంది ఆకలి చావులకు గురయ్యారని పేర్కొన్నారు. ఆ సమయంలో ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన వెంగళరెడ్డి కరువుపోయే వరకు వేలాది మందికి అంబ లిపోసి ఆదుకున్నట్లు చరిత్ర చెబుతుం దన్నారు. కర్నూలు సిల్వర్ జూబ్లి కళాశాల సీనియర్ చరిత్ర అధ్యాపకులు డాక్టర్ బి.ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రేనాటి సూర్యచంద్రులు వాసికెక్కిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి త్యాగం, బుడ్డా వెంగళరెడ్డి దాతృత్వం మరిచిపోరాదన్నారు. కళాశాల ఎకనామిక్స్ విభాగం అధ్యాపకులు డాక్టర్ ఎం.గురు మోహన్‌రెడ్డి, పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు పి.వి.సుబ్బారెడ్డి, వేంపల్లె డిగ్రీ కళాశాల అధ్యాపకులు బాలకొండ గంగాధర్ మాట్లాడుతూ రాయలసీమకు ఎంతో గొప్ప చరిత్ర ఉందన్నారు. ఎరాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధన్ రాజు మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, బుడ్డా వెంగళరెడ్డి జీవితాల గురించి పాఠ్యాంశాలుగా చేర్చాలని కోరారు. రాయలసీమలోని ఎందరో మహానుభావుల జీవితాలను, ఆనాటి సామాజిక విశేషాలను వెలుగులోకి తెచ్చేందుకు ఇక్కడి విశ్వవిద్యాలయాలు పరిశోధనలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల చరిత్ర విభాగ అధ్యాపకులు నాగవేణి, రవిశేఖర్‌రెడ్డి, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రాగా ముగిసిన చిత్తూరు, నెల్లూరు మ్యాచ్

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ సౌత్ జోన్ అండర్-14 మల్టీ డే మెన్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా ఎసిఎ స్టేడియంలో చిత్తూరు, నెల్లూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఆరు వికెట్ల నష్టానికి 184 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 66.1 ఓవర్లలో 226 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. చిత్తూరు జట్టులోని తరుణ్ కుమార్‌రెడ్డి 4, రక్షణ సాయి మూడు వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ చిత్తూరు జట్టు 75.0 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 325 పరుగులు చేసింది. ఆ జట్టులోని పవన్ గోవర్ధన్ 151 పరుగులు చేశాడు. మణిదీప్ 90 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టులోని మౌనిష్, శ్రీచరణ్ చెరో ఒక వికెట్ తీసుకున్నారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు ఆట ముగిసే సమయానికి 40 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 26 పరుగులు చేసింది. మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో చిత్తూరు జట్టు ఆధిక్యత సాధించింది.

కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో అనంతపురం కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగాముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో అనంతపురం జట్టు 268 పరుగులు చేసింది. ఆ జట్టులోని ముఖేష్ మోక్షజ్ఞ తేజ్ 138, హేమచంద్ర 113 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని హేమంత్, యశ్వంత్ చెరో రెండు వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన కర్నూలు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 72 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 189 పరుగులు చేసింది. ఆ చెట్టులోని మోక్షజ్ఞరెడ్డి 90 చేశారు. అనంతపురం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి 7 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 13 పరుగులు చేసింది. మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో అనంతపురం జట్టు ఆదిత్య సాధించింది.

ఆత్మహత్యకు ప్రయత్నించిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి-వల్లూరు

ఆత్మహత్యకు ప్రయత్నించిన వ్యక్తిని పోలీసులు కాపాడిన ఘటన వల్లూరు మండలంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు వల్లూరు గ్రామానికి చెందిన రసూల్ 33 అనే వ్యక్తి గంగాయపల్లి రైల్వేస్టేషన్ వద్ద ఆత్మహత్యకు ప్రయత్నించారని కుటుంబ సభ్యులు తెలపడంతో వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి పోలీసులు ట్రాక్‌పై ఉన్న రసూల్‌ను కాపాడారు. కుటుంబ సమస్యల వల్లే ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తిని పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్ఐ పెద్ద ఓబన్న మాట్లాడుతూ ఆత్మీయత ప్రయత్నించిన వ్యక్తికి ధైర్యం చెప్పాడు జీవితం చాలా విలువైన సమస్యలు వస్తే చర్చించుకోవాలి వాటి నుండి తప్పించుకోవడం కాదు అని ప్రస్తులకు అతని కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు.

వైవీయూ వసతి గృహాల్లో విసి తనిఖీ

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయ విసి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ బుధవారం బాలురు, బాలికల వసతి గ ృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహాలలో తయారవుతున్న ఆహార పదార్థాలు రుచికరంగా ఉంటున్నాయా లేదా అంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అల్పాహారాన్ని పరిశీలించారు. వంటి గది పరిసరాలను చూశారు. డైనింగ్ హాల్లో విద్యార్థులు అల్పాహారం తింటుండగా విసి వారివద్దకు వెళ్లి మాట్లాడారు. వసతిగృహాల్లో పని చేసేవారు విధులను ఎంతో బాధ్యతతో నిర్వర్తించాలన్నారు. ఇలానే ఆకస్మిక తనిఖీలు ఉంటాయని తెలిపారు.

తుపాన్‌తో నష్టపోయిన వారిని ఆదుకోవాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

మొంథా తుపాన్ కారణంగా కడప నగరంలో నష్టపోయిన ఎస్‌సి, ఎస్‌టి కాలనీల్లో పర్యటిస్తామని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు రఘు, కార్యదర్శి బండి జకరయ్య, ఉపాధ్యక్షులు జార్జ్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని కెవిపిఎస్ కార్యాలయంలో నగర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుపాన్ కారణంగా దెబ్బతిన్న మరియాపురం, తారక రామారావు నగర్, ప్రకాష్ నగర్, మృత్యుంజయకుంట, ఆర్యేనగర్, తిలక్ నగర్, బుడ్డాయపల్లె ఎస్‌సి, ఎస్‌టి కాలనీల్లో నగర కమిటీ ఆధ్వర్యంలో పర్యటన ఉంటుందని తెలిపారు. ఒక్కొక్క ఇంటికి రూ.20 వేలు నష్ట పరిహారం ఇవ్వాలని, అందరికీ పక్కా గృహాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రోడ్లు, డ్రెయినేజీ కాలువలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. వీధిలో సరిగా లైట్లు వెలగలేదని తెలిపారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనకు సిద్ధం చేస్తామని హెచ్చరించారు.

విసిని సన్మానించిన ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్



విసిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ

యోగివేమన విశ్వవిద్యాలయం విసి రాజశేఖర్‌ను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం బిసి చాంబర్లో బొకే, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రామ చంద్రారెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి దిశగా తీసుకువెళతారనే విశ్వాసం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి మానస పుత్రికైన వైవీయూ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. విద్యా, పరిశోధనాపరంగా ముందుకు వెళుతోందని సంతోషం వ్యక్తం చేశారు. కార్యదక్షత గల విసి రావడం సంతోషకర పరిణామమని పేర్కొన్నారు. హెల్త్ సెంటర్ నిర్మాణాలను పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకు రావాల్సి ఉందన్నారు. అకాడమిక్ కన్సల్టెంట్లకు 110 జిఒను అమలు చేయాలని తెలిపారు. స్పందించిన విసి తప్పక చేస్తామని స్పష్టం చేశారు.

ఉచిత పశువైద్య శిబిరం

ప్రజాశక్తి-కాసినాయన

మండల పరిధిలోని అంబవరంలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరం ఇటుకలపాడు పశువైద్యాధికారి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పోరుమామిళ్ల సహాయ సంచాలకులు చంద్రశేఖర్ హాజరయ్యారు. వైద్య శిబిరంలో 27 కేదలకు గరకోశ వ్యాధి సూటి పరీక్షలు నిర్వహించారు అంతేకాకుండా 49 దూడలకు అవసరమైన పరీక్షలు నిర్వహించారు దాదాపు 1500 గొర్రెల మేకలకు నట్టల నివారణ మందు ఏర్పాటు చేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ పశు వులకు లింగ నిర్ధారణ ప్రాముఖ్యత గురించి వారి వినియోగం గురించి రైతులకు క్లుప్తంగా ఆయన వివరించారు. పశువులలో సంభవించు సీజనల్ వ్యాధులను గురించి తెలిపారు. గ్రామాలలో పశువులకు వింత జబ్బులు ఏవైనా కనిపిస్తే వెంటనే ఇటుకలపాడు పశు వైద్యాధికారికి సమాచారం ఇవ్వాలన్నారు.

రిమ్స్‌కు సిటీ బస్సు సర్వీసు ప్రారంభం

ప్రజాశక్తి-కడప అర్బన్ : ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు రిమ్స్‌కు సిటీ బస్సు సర్వీస్‌ను ప్రారంభించామని ఎమ్మెల్యే మాధవి అన్నారు. బుధవారం రిమ్స్ ఆవరణలో సిటీ బస్సు సౌకర్యాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ శ్రీధర్, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, ఆర్ఎం గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ ఈ సర్వీస్ ప్రారంభం ద్వారా రిమ్స్‌కు వచ్చే రోగులు, సిబ్బంది, నగర ప్రజలకు ప్రయాణంలో అనేక ఇబ్బందులు తొలగి, సౌకర్యవంతమైన రవాణా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. పేద ప్రజలు, పట్టణ పరిధిలోని దూర ప్రాంతాల వారు రిమ్స్‌కి చేరు కునే విషయంలో ఎదుర్కొంటున్న కష్టాలు తగ్గనున్నాయని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను అమలు చేయడమే ఈ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కడప అభివృద్ధిపై మా దృష్టి కేంద్రీకృతమై ఉందని పేర్కొన్నారు. రిమ్స్ మేనేజ్‌మెంట్‌తో కలిసి ప్రతి అంశం దశలవారీగా పరిష్కరించేందుకు కృషి కొనసాగిస్తామన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న జెడి శ్రీనివాసులు

సిబ్బంది సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి - చాపాడు

పశువైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని ఆ శాఖ జెడి శ్రీనివాసులు సూచించారు. స్థానిక పశువైద్యశాలను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోజువారి పశువుల పరీక్షల రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో పాడి రైతులకు అందుబాటులో ఉంటూ ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పశువులకు వివిధ రకాల జబ్బులు వచ్చే అవకాశం ఉందన్నారు. రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పశువుల పాకలు తడి లేకుండా ఆరబెట్టుకునేలా జాగ్రత్తలు పాటించాలన్నారు. జెవిఒ వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

ప్రభుత్వం అందిస్తున్న సేవలను బాలికలు సద్వినియోగం చేసుకొని అన్ని రంగాల్లో రాణించాలని ఎంఇఒలు రవిశంకర్, వంశీకృష్ణ సూచించారు. జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. బాలికలనుద్దేశించి ఎంఇఒలు మాట్లాడుతూ సమానం అవకాశాలను కల్పిస్తున్నారన్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ సుబ్బరత్నమ్మ, అంగన్వాడీ టీచర్ మహాలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


శ్రీచరణి కుటుంబ సభ్యులతో డివైఎఫ్ఐ నాయకులు

శ్రీచరణి తల్లిదండ్రులకు అభినందనలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

మహిళా ప్రపంచకప్ విజేత కడప బిడ్డ శ్రీచరణి తల్లిదండ్రులైన నల్లపురెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రేణుక, వారి కుటుంబాన్ని డివైఎఫ్ఐ నాయకులు అభినందించారు. ఆ మేరకు వారు బుధవారం ఆర్‌టిపిపి వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ మాట్లాడుతూ మహిళా ప్రపంచ కప్ ఫైనల్స్‌లో శ్రీచరణి భారత్ టీమ్ విజేతగా నిలిచారని, ఆ గెలుపు దేశం మొత్తం సంబరం చేసుకుంటోందన్నారు. మన జిల్లా వాసి శ్రీచరణి మంచి ప్రతిభ చాటారని కొనియాడారు. కడప జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తెచ్చారన్నారు. పురుషులకు ధీటుగా మహిళలు కూడా నేటి సమాజంలో అన్ని రంగాల్లో రాణిస్తుండడం గర్వించదగ్గ విషయమన్నారు. నేటి మహిళా యువత శ్రీచరణిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు విశ్వనాథ్, హబీబ్ పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

ప్రజాశక్తి - లింగాల

మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులకు సహకార సంఘం అధ్యక్షుడు నవీన్‌కుమార్ రెడ్డి బుధవారం యూరియా పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సహకార సంఘానికి 10 టన్నుల యూరియా, 10 టన్నుల డిఎపి మంజూరైనట్లు తెలిపారు. రైతులు ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. త్వరలో అరటి రైతులకు ఎరువులను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎఒ రమేష్, ఎఇఒ రాణి, సహకార సంఘం సిఇఒ వినోద్‌కుమార్, జూలువకర్ పాల్గొన్నారు.


యూరియా పంపిణీలో సొసైటీ అధ్యక్షుడు నవీన్ కుమార్‌రెడ్డి

క్రైం కార్నర్

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

2017 జనవరి 19న పట్టణంలోని నాగులకట్ట హాస్టల్ వద్ద జరిగిన హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు శిక్షను ఎస్‌సి, ఎస్‌టి కం అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్ట్ జడ్జి ధీనబాబు విధించారని అర్బన్ సిఐ నరేష్ బాబు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎనిమిదేళ్ల క్రితం జరిగిన హత్య కేసును మృతుడు మునగాల రవి భార్య గంజి పద్మావతి తన భర్తను లక్కిరెడ్డి సూర్య నారాయణరెడ్డి, మాధవి హత్య చేశారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. వారిని అప్పటి సిఐ నాగరాజు డిఎస్‌పి సర్కార్ ఆదేశాలతో అరెస్ట్ చేశారన్నారు. విచారణలో నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు, ఇద్దరికి రూ.1000 జరిమానా విధించారన్నారు. ఆ మేరకు అప్పటి పోలీస్ అధికారులను, ప్రస్తుత అధికారులను, కానిస్టేబుల్స్‌ను ఎస్పీ అభినందించారని సిఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కాశినాయన

మండల పరిధిలోని వరికుంట్ల గ్రామానికి చెందిన వరికుంట్ల జయన్న (56) అనే వ్యక్తి విద్యుత్ తీగలు తగిలి బుధవారం మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. జయన్న అడవి పందులు పొలాల్లోకి రాకుండా ఒక బీడు పొలంలో 11 కెవి వైర్లకు కరెంటు తగిలించాడు. దురదృష్టవశాత్తూ ఆ కరెంటు అతనికే తగిలిందన్నారు. విషయం తెలుసుకున్న నరసాపురం ఎస్ఐ యోగేంద్ర సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


సంఘటనా స్థలంలో నరసాపురం ఎస్ఐ యోగేంద్ర

కొత్త పింఛన్ల కోసం ఎదురుచూపులు...!



ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

కొత్త పింఛన్ల మంజూరుకు మండలంలోని వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిన్నర దాటినా కొత్త పింఛన్ ఒక్కటి కూడా మంజూరు కాలేదు. పింఛన్ల ద్వారా ప్రభుత్వం ఆర్థిక భరోసా ఇస్తూ చేదోడుగా ఉంటోంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక్క కొత్త పింఛన్ కూడా ఇవ్వలేదని ఎదురుచూస్తున్న అర్హులు ఆవేదన చెందుతున్నారు. దరఖాస్తు చేసుకునేందుకు కూడా అవకాశం లేకుండా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఒక్క కొత్త పింఛను కూడా ఇవ్వని పరిస్థితి. 85శాతం వికలత్వం, అంధులకు రూ.15వేలు పింఛన్ ఇస్తామని చెప్పినప్పటికీ, వాటిని కూడా అమలు చేయని పరిస్థితి. భర్త చనిపోయిన మహిళకు పింఛన్ కేటాయించడంలో అధికార యంత్రాంగం చురుగ్గానే పనిచేస్తోంది. కొత్త పింఛన్ల విషయం వచ్చే సరికి నోరు మెదపడం లేదనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేయాలని అర్హులు కోరుతున్నారు.

పిపిపి విధానాన్ని ఉపసంహరించుకోవాలి


మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి - వేముల

వేముల మీదిపెంట్ల పంచాయతీ రాచుకుంటపల్లిలో బుధవారం మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ వైసిపి చేపట్టిన కోటి సంతకాల రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని పార్టీ మండల కన్వీనర్ నాగెళ్ల సాంబశివరెడ్డి, జడ్పీటీసీ కోకటం వెంకటబయపురెడ్డి, మాజీ పీసీబీ సభ్యులు మరక శివకృష్ణారెడ్డి, నాయకులు ప్రారంభించారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమంలో భాగంగా చేపట్టామన్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో దాదాపు 12,000 మంది సంతకాల ద్వారా తమ నిరసనను తెలి పారన్నారు. కోటి సంతకాల కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వేముల మండల ప్రజలు, వైసిపి నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలుపుతున్నామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మరక మల్లారెడ్డి, చల్లా వెంకట నారాయణ, ఉపాధ్యక్షుడు నారుబోయిన గంగాధర, చలపతి, చందా మల్లిరెడ్డి, కొప్పుల నారాయణ, రెడ్డెయ్య, రాదాకృష్ణ, నాగప్ప, గండు సహనంద, వెంకట నారాయణ, గండికోట భూషణ, సుభాష్ పాల్గొన్నారు.

వేంపల్లె : ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరణ పేరుతో ధారదత్తం చేయడం సరైంది కాదని జడ్పీటీసీ రవికుమార్ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ చంద్రఓబుల్ రెడ్డి పేర్కొన్నారు. చింతలమడుగుపల్లె, కుమ్మరాంపల్లె, మదీనాపురం, పక్కిర్‌పల్లె, శ్రీచైతన్య పాఠశాల వీధిలో బుధవారం మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ ఆపాలంటూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వైసిపి నేతలు రామచంద్రారెడ్డి, రవిశంకర్ గౌడ్, రాష్ట్ర ప్రచార సంయుక్త కార్యదర్శి నిసార్, ముత్యాల ఆంజనేయులు, కృష్ణయ్య, ప్రసాద్, బిఎస్ షేక్షావలి, రహంతుల్లా ఖాన్, భారతి, ఓబులేసు, గోపాల్, భాస్కర్‌రెడ్డి, అన్నయ్య, రామకృష్ణారెడ్డి, మటన్ బాబా, గణేష్, గంగధర్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటా చెత్త సేకరించాలి : డిఎల్‌పిఒ

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించాలని జమ్మలమడుగు డిఎల్‌పిఒ నూర్జహాన్ పారిశుధ్య కార్మికులకు సూచించారు. స్థానిక వెంకటరెడ్డి కాలనీలో బుధవారం డిఎల్‌పిఒ పర్యటించారు. పారిశుధ్య కార్మికులు రోజూ చెత్త సేకరిస్తున్నారా లేదాని కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు. సేకరించిన తడి పొడి చెత్తను వేరు చేసి చెత్త నుండి సంపద తయారీ కేంద్రానికి తరలించాలని కార్మికులకు సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీ సచివాలయంలో ఇంటి పన్ను, పన్నేతర, స్వామిత్వ ప్రగతిపై సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇంటి పన్ను వసూళ్ల వేగంగా చేయాలన్నారు. స్వామిత్వ కార్యక్రమాన్ని పూర్తి చేయా లని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. అనంతరం కొత్తపల్లి, తిమ్మాపురం గ్రామ సచివాల యాలను డిఎల్‌పిఒ పరిశీలించి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ వీరభద్రుడు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.


కాలనీవాసులతో మాట్లాడుతున్న నూర్జహాన్

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని, గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహించాలని డీఎస్పీ వెంకటేశ్వరరావు సిబ్బందికి సూచించారు. వార్షిక తనిఖీలో భాగంగా బుధవారం కలమల్ల పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ పోలీస్ సిబ్బంది బాధ్యత వహిస్తున్న గ్రామాల స్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఫ్యాక్షన్‌కు తావు లేకుండా, ఎవరు గొడవలు జోలికి వెళ్లకుండా, చెడు వ్యసనాల జోలికి వెళ్లకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్డిపిఒ, సిఐ టి.రాజ, ఎస్ఐ సునీల్ కుమార్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దాతలకు ఘన సన్మానం

ప్రజాశక్తి - చక్రాయపేట

చక్రాయపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బీరువాలు, డెస్కులు వితరణ చేసిన దాతలను బుధవారం ఘనంగా సన్మానించారు. కళాశాల ప్రిన్సిపల్ షేక్ రంతు బాషా ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు దాతలు మోపురి రామాంజనేయరెడ్డి(అడ్వకేట్) వేంపల్లి చైతన్య స్కూల్ అధినేత బండ్రెడ్డి చక్రపాణిరెడ్డిని ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా దాతలు కళాశాలలోని ల్యాబ్‌లకు స్టూళ్లు కూడా విరాళంగా అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్ రంగారెడ్డి, శ్రీవెంకటేశ్వర రాచరాయ స్వామి దేవస్థాన సభ్యులు రామచంద్రారెడ్డి, రామకృష్ణ, వైస్ చైర్మన్ ఈశ్వరయ్య, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి

ప్రజాశక్తి - లింగాల

సారవంతమైన నేలను కోల్పోకుండా ఉండాలంటే రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని ఎఒ రమేష్ సూచించారు. మండల పరిధిలోని కోమన్నూతల రైతు సేవా కేంద్రంలో ఆయన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు, మందులు వాడడం వల్ల ప్రకృతి కాలుష్యమై, అధిక ఖర్చులు, నాణ్యత లేని పంటలు వస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటల పండించాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది హరిశిల్ప, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలి

మైదుకూరు టౌన్ : తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే పద్ధతులను అవలంబించాలని ఎఒ ఇ.బాల గంగాధర్ రెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని గొల్లపల్లి, యాపరాలపల్లె గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నూతన పద్ధతులతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలన్నారు. రైతులు పొలాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. పంటలో నీరు నిల్వ ఉంటే 19:19:19, 13:0:45, తెగులు మందులు వాడాలని తెలిపారు. ప్రతి రైతు క్రిమిసంహారక మందుల వాడకం తగ్గించాలన్నారు. అవసరం, సూచించిన పరిమాణం మేరకే వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ ఎంఐఏఓ సిద్ధారెడ్డి, సెరికల్చర్ అధికారి గుర్రప్ప, వ్యవసాయ శాఖ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


శనగలను పంపిణీ చేస్తున్న సర్పంచ్, విఎఎ

రైతులకు శనగలు అందజేత

ప్రజాశక్తి - జమ్మలమడుగు

మండల పరిధిలోని మోరగుడి రైతు సేవా కేంద్రంలో బుధవారం సర్పంచ్ జి.కొండయ్య రైతులకు శనగలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అవసరమైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కురిసిన వర్షాలకు పంట వేయడానికి ఇది సరైన అదునన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి సుధీర్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

వంద శాతం టీకాలు వేయాలి

తొండూరు : మండలంలో వంద శాతం టీకాలు వేసే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని టీకాల అధికారి డాక్టర్ ఉమామహేశ్వర కుమార్ ఆదేశించారు. తొండూరు పిహెచ్‌సిని బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిశు మరణాలు లేకుండా చూడాలన్నారు. వ్యాక్సిన్ నిల్వలను, రికార్డులను పరిశీలించారు. ఉపకేంద్రంలో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ సుభాషిణి, సిహెచ్ఒ మునిరెడ్డి, సూపర్వైజర్ శశికళ, స్టాఫ్ నర్స్ అనూష, ఆరోగ్య కార్యకర్తలు నాగేశ్వరీ, మంజుల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తులను రికార్డుల్లో నమోదు చేయాలి

వేంపల్లె : రైతులు మార్కెట్‌కు తరలించే ఉత్పత్తులను చెక్ పోస్టుల్లో మార్కెట్ యార్డు సిబ్బంది రికార్డుల్లో నమోదు చేయాలని పులివెందుల జనసేన సమన్వయ కర్త డాక్టర్ హరీష్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మల్లికార్జున సూచించారు. కడప బైపాస్ రోడ్డులో ఉన్న మార్కెట్ యార్డు చెక్ పోస్టును బుధవారం వారు పరిశీలించారు. చెక్ పోస్టుల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. కూటమి ప్రభుత్వ పాలనలో రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని చెక్ పోస్టు సిబ్బందికి సూచించారు. విధులకు సకాలంలో హాజరుకావాలని సూచించారు. చెక్‌పోస్టు వద్ద వాహనాలు నిలపడం లేదని, స్పీడ్ బ్రేకర్ వేయించాలని మార్కెట్ యార్డు డైరెక్టర్‌ను సిబ్బంది కోరారు. రోడ్డు భవనాల శాఖ అధికారులతో చర్చించి సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు.


భూమిపూజ చేస్తున్న దేవస్థానం చైర్మన్, కమిటీ సభ్యులు

వంటశాల, డైనింగ్ హాల్‌కు భూమిపూజ

ప్రజాశక్తి - చక్రాయపేట

శ్రీవెంకటేశ్వర, రాచరాయ స్వామి ఆలయాలకు అనుసంధానంగా ఉన్న కల్యాణమండపానికి సంబంధించి వంటశాల, డైనింగ్ హాల్ నిర్మాణానికి బుధవారం భూమి పూజ చే శారు. దాతల సహకారంతో నిర్మిస్తున్న వీటికి ఆలయ చైర్మన్ మో పురి రామాంజనేయరెడ్డి (అడ్వకేట్)దంపతులచే ఆలయ అర్చ కుడు అనంత పద్మనాభ శర్మ పూజారి కార్యక్రమాలు చేయిం చారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్లు కర్నాటి హరినాథ్ రెడ్డి, బండ్రెడ్డి చక్రపాణిరెడ్డి, కమిటీ సభ్యులు రంగారెడ్డి, ఈశ్వ రయ్య, రామ చంద్రారెడ్డి, శ్రీరామ్ మూర్తి, శ్రీనివాసులు, రామ చం ద్రారెడ్డి, పెంచలయ్య, పవన్‌కల్యాణ్, బాల నారాయణ, రిటైర్డ్ లెక్చరర్లు చెన్నారెడ్డి, బండి రామకృష్ణారెడ్డి, కాంట్రాక్టర్ రంగారెడ్డి పాల్గొన్నారు.

ఆర్ఎస్‌కె అసిస్టెంట్ సస్పెన్షన్

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని అంకాలమ్మ గూడూరు రైతు సేవ కేంద్రం అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్ రెడ్డిని సస్పెన్షన్ చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో అక్రమాలకు పాల్పడి పరార్ కావడంతో కలెక్టర్ ఉత్తర్వుల మేరకు సస్పెన్షన్ చేశామన్నారు.


మాట్లాడుతున్న ఎంపిడిఒ సుబ్బారెడ్డి

కూలీలకు ఇకెవైసి పూర్తి చేయాలి

ప్రజాశక్తి - దువ్వూరు

'ఉపాధి' కూలీలకు ఇకెవైసి తప్పనిసరి అని ఎంపిడిఒ సుబ్బారెడ్డి ఆదేశించారు. క్షేత్ర సహాయకులకు ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2026-27 సంవత్సరానికి సంబంధించి పనులు గుర్తించాలన్నారు. పండ్ల తోటలు పెంపకం కోసం లబ్ధిదారులను గురించేందుకు ఇంటింటి సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ లక్ష్మీనారాయణ, ఇసి ఇందిరా ప్రియాంక, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి - వేంపల్లె

కాంగ్రెస్ పార్టీకి ఉజ్వల భవిష్యత్తు రాబోతున్నట్లు పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. కడపకు చెందిన అబ్దుల్ రవూఫ్‌ను కాంగ్రెస్ అధిష్టానం యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించిన సందర్భంగా బుధవారం వేంపల్లెలో ఉన్న తులసిరెడ్డిని అబ్దుల్ రవూఫ్, మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఖాజా మైనుద్దీన్ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం తులసిరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేకహోదా, చట్టంలోని అంశాలు అమలు చేయకుండా తీరని ద్రోహం చేసిందన్నారు. విభజన చట్టంలోని అంశాలు అమలు కావాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. వైసిపి, టిడిపి, జనసేన పార్టీలతో ప్రజలు విసిగి పోయారని తెలిపారు. పదవులు పొందినవారు క్రమశిక్షణ, అంకితభావం, ఆత్మవిశ్వాసంతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ నాయ కులు అమర్నాథరెడ్డి, ఉత్తన్న, రవీంద్రనాథ్‌రెడ్డి, ఐచర్ రమణ, నాగరాజు పాల్గొన్నారు.



దీక్షను ప్రారంభించిన రాచమల్లు

ప్రొద్దుటూరులో విచ్చలవిడిగా జూదం : 'రాచమల్లు'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు మున్సిపల్ ఎగ్జిబిషన్‌కు సంబంధించి టీడీపీకి చెందిన గుత్తేదారుడు సుమారు రూ.కోటి ఎగవేసిన నేపథ్యంలో.. ఆ డబ్బును మున్సిపల్ ఖజానాకు చెల్లించే వరకు దీక్షలు కొనసాగిస్తామని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆ మేరకు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆయన రిలే నిరాహార దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆయన కుమారుడు కొండారెడ్డి అండ చూసుకొని గుత్తేదారుడు ఈ మోసానికి పాల్పడినట్లు ఆరోపించారు. దీక్షలో వైసిపి నియోజకవర్గ అధ్యక్షులు ఖాజాపూర్, 9వ వార్డు కౌన్సిలర్ సత్యం పాల్గొన్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు మద్దతు తెలిపారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రొద్దుటూరులో విచ్చలవిడిగా జూదం నిర్వహిస్తున్నారని వైసిపి అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం తను చేస్తున్న దీక్షా శిబిరం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రొద్దుటూరు నియోజకవర్గంలో జూదం అధికంగా నిర్వహిస్తున్నారని, ప్రతిరోజు సాక్ష్యాలు, ఆధారాలతో చెబుతున్నానని తెలిపారు. ఇటీవల నక్కలదిన్నెలో జూదమాడుతున్నారని తాను చెప్పిన మాట వాస్తవమైందన్నారు. ఇప్పటికైనా ఎస్‌పి ప్రత్యేకించి చర్యలు తీసుకుంటేనే ప్రొద్దుటూరు జూదం నియంత్రణలోకి వస్తుందని తెలిపారు.


అన్నదానం చేస్తున్న మధుసూదనరెడ్డి

మునెయ్యస్వామి కోనలో అన్నదానం

ప్రజాశక్తి - ముద్దనూరు

కార్తికపౌర్ణమి సందర్భంగా బుధవారం జమ్మలమడుగు రోడ్డులో ఉన్న మునెయ్యస్వామి కోన శివాలయంలో మండల నాయకులు డాక్టర్ కటికరెడ్డి మధుసూదనరెడ్డి, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా మధుసూదనరెడ్డి మాట్లాడుతూ కార్తిక పౌర్ణమి రోజున మునీశ్వరుని దర్శనానికి వచ్చే భక్తులకు అన్నదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ సురేంద్రనాథ్ రెడ్డి, నాయకులు సుబ్బరాయుడు, లక్ష్మి నారాయణ, శంకర్‌రెడ్డి, గఫూర్, వినోద్, సాగర్, నాగరాజు, రాజా యాదవ్ పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో జిల్లా స్థాయికి శ్రీచైతన్య విద్యార్థులు

ప్రజాశక్తి- వేంపల్లె

జిల్లాస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి చెప్పారు. వేంపల్లె ఉర్దూ పాఠశాలలో నిర్వహించిన మండలస్థాయిలో సైన్స్ చెకుముకి పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు మొదటి, రెండవ స్థానాల్లో ప్రతిభ చూపినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బుధ వారం ఆ విద్యార్థులను చక్రపాణిరెడ్డి అభినందించారు. జిల్లా స్థాయిలోనూ మరింత ప్రతిభ కనబరచాలని ఆయన కోరారు.